క్లుప్తంగా

ఆలయానికి విరాళం



లక్ష రూపాయలు విరాళం అందజేస్తున్న పద్మావతి

తిరుపతి కల్చరల్: స్థానిక పల్లివీధిలోని శ్రీషిరిడి సాయిబాబా ఆలయానికి బొమ్మగుంటకు చెందిన పద్మావతి గురువారం లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు సునీల్ చక్రవర్తి, శ్రీనివాసులకు అందజేశారు. ఈ సొమ్మును అన్నదానం కోసం వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పద్మావతిని ఆలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో 31వ వార్డు కార్పొరేటర్ సీకే.రేవతి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల చిన్నారులకు హెల్త్ క్యాంప్



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న స్విమ్స్ వైద్యులు

తిరుపతి తుడా: స్విమ్స్ పద్మావతి మహిళా వైద్య కళాశాల పిడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం తిరుపతి రూరల్ మండలం వెంకటపతి నగర్‌లోని శ్రీ కపిలేశ్వరస్వామి ఉన్నత పాఠశాలలో హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. మొత్తం 116 మంది చిన్న పిల్లలను పరీక్షించి కొంతమంది మంది వివిధ రుగ్మతలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారిని వైద్యపరీక్షలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో పిడియాట్రిక్స్ వైద్యులు డాక్టర్ లలిత, నర్సింగ్ సిబ్బంది పద్మజ, విమల, నర్సింగ్ స్టూడెంట్స్ రమ్యశ్రీ, లక్ష్మీ సింధుజ, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, అమరేంద్ర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రుయా కార్మికుల సమస్యలు పరిష్కరించరూ!



అదనపు ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబుకు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తిరుపతి తుడా: రుయా హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆస్పత్రి పరిశీలనకు వచ్చిన ప్రభుత్వ అదనపు ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణ బాబుకు, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరుతూ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే రాధాకృష్ణ, అధ్యక్ష కార్యదర్శులు కేవై రాజా, ఎన్‌డీ రవి గురువారం వినతి పత్రం ఇచ్చారు. ప్రతి నెలా కార్మికులు జీతాల కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని, కాంట్రాక్టర్ల వేధింపులు ఎక్కువవుతున్నాయని, జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని సమస్యలు నివేదించారు. రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ కాంట్రాక్టర్లతో కలిసి కార్మికుల సమస్యలు గాలికి వదిలేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించాలని కోరారు. అలాగే వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఏపీ స్పెషల్ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ టి కృష్ణబాబును ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆర్ రాజా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హంస సెక్రటరీ ఎం.టాటాబాయి, వైస్ ప్రెసిడెంట్ ఇమ్రాన్, ట్రెజరర్ ముఖేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లూమ్స్ ధ్వంసకులపై చర్యలు తీసుకోండి

తిరుపతి కల్చరల్: అద్దె చెల్లింపులో తలెత్తిన వివాదంతో దౌర్జన్యంగా పవర్ లూమ్స్‌ను ధ్వంసం చేసి, తీవ్ర నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు యశోద, రామదాసు విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద మాట్లాడుతూ, తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ శ్రీనగర్ కాలనీ ప్రాంతంలో డి.రాజేశ్వర రావుకు చెందిన స్థలాన్ని లీజుకు తీసుకుని బ్యాంకు రుణాలతో ఎల్‌వీ పవర్ లూమ్స్ ఏర్పాటు చేసి జీవిస్తున్నామన్నారు. అయితే స్థల యజమాని కొంతమందిని తీసుకొచ్చి తమ పవర్ లూమ్స్‌ను ధ్వంసం చేసి చీరలు కూడా తీసుకెళ్లారని ఆరోపించారు. కనీసం పవర్ లూమ్స్‌ను మార్పు చేసేందుకు కూడా సమయం ఇవ్వలేదని వాపోయారు. స్థల యజమాని రాజేశ్వరరావు, సరోజిని దేవిలపై చర్యలు తీసుకుని తమకు జరిగిన ఆస్తినష్టంపై ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

55 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతి నగరంలో రోడ్డుకు ఇరువైపులా ప్రజలకు, వాహనాలకు ఇబ్బంది కలిగిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్న 55 మందికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి గురువారం తీర్పు చెప్పారు.

ఎస్‌జీఎస్ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి సిటీ: మహతి ఆడిటోరియం వేదికగా వే ఫౌండేషన్ 11వ వార్షికోత్సవంలో భారతీయ కళా ఉత్సవంలో ఎస్‌జీఎస్ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనను కనబరిచారు. నిర్వాహకులు విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ఎప్పుడూ ఫుల్..ఆదాయం నిల్

కూటమి నేతలకు అడ్డాగా ఆర్‌అండ్‌బీ

తిరుమల శ్రీవారి దర్శనార్థం నిత్యం వచ్చే వేలాది భక్తులు వస్తున్న దృష్ట్యా తిరుపతిలో అద్దె గదులకు డిమాండ్ పెరిగిపోతోంది. అయితే నగరంలో చెన్నారెడ్డి కాలనీలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం కూటమి నేతలకు అడ్డాగా మారిందనే విమర్శలొస్తున్నాయి. నేతల సిఫార్సుతో కొందరు ఏకంగా వారాల తరబడీ తిష్ట వేస్తున్నట్లు సమాచారం. అలాగే ఆర్‌అండ్‌బీకి చెందిన కొందరు ఉన్నత స్థాయి అధికారులతో మరి కొందరు అతిథి గృహంలో మకాం వేస్తున్నట్లు తెలియవచ్చింది. ఇలా వచ్చేవారంతా రూపాయి కూడా చెల్లించకపోవడంతో అతిథి గృహానికి రాబడి కరువైంది. కొందరు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారనే ఆరోపణలూ లేకపోలేదు.



తిరుపతిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

- అతిథిగృహంలో 8 ఏసీ గదులు
- నేతలు, అధికారులు సిఫార్సు చేస్తే గదులు ఫ్రీ..?
- అద్దె చెల్లించకుండా రోజుల తరబడీ తిష్ట వేస్తున్న ఘనులు
- ఆదాయం బెత్తెడు..ఖర్చులు బారెడు
- కరెంటు చార్జీలకే సరిపోని ఆదాయం!

తిరుపతి అర్బన్: స్థానిక చెన్నారెడ్డి కాలనీలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో 8 ఏసీ గదులున్నాయి. చిన్నపాటి సమావేశాలు నిర్వహించుకోవడానికి వీలుగా చిన్న హాల్ కూడా ఉంది. అయితే ఆర్‌అండ్‌బీ అధికారుల గదులకు సిఫార్సుతో వస్తే రోజుకు ఒక్కో గదికి రూ.500 మాత్రమే అద్దె. సిఫార్సు లేకుండా గదులను అద్దెకు తీసుకుంటే రోజుకు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. 8 గదుల్లో కనీసం రోజు 4 గదులు భర్తీ చేసినా రోజుకు రూ.2 వేల నుంచి రూ.4వేల ఆదాయం రావాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు రూ. 60వేల నుంచి రూ.1.20లక్షలు రావాలి. అయితే నెలకు రాబడి రూ.4వేలకు వస్తున్నట్లు మాత్రమే లెక్కలు చెబుతుండటం విస్తుగొలుపుతోంది. దీనిని లోతుగా విశ్లేషిస్తే..అధికారుల సిఫార్సులతో వచ్చే వారికి అద్దె లేకుండా ఉచితంగా గదులు ఇవ్వడమో లేదా గదులకు అద్దె వసూలు చేసినా లెక్కలు చూపకుండా స్వాహాయణమో చేస్తున్నారా? అనే అనుమానాలు రేకెత్తిస్తోంది.

ఖర్చులు రూ.65 వేలు...రాబడి మాత్రం రూ.4 వేలు

అతిథి గృహంలో నలుగురు కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారి నెల జీతాలు రూ.48 వేలు, నెలకు రూ.15వేలు కరెంట్ బిల్లు వస్తోంది. మొత్తంగా నెలకు రూ.63 వేలు ఖర్చు అవుతోంది. అయితే వారు నెలకు అతిథి గృహానికి వచ్చే రాబడి మాత్రం కేవలం రూ.4 వేలు మాత్రమే అని చెబుతుండటం ఆశ్చర్యకరం. తిరుపతి నగరంలో సాధారణ రూములకు సైతం అద్దె బాగా వసూలు చేస్తున్నారు. అలాంటిది ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలాసవంతమైన ఏసీ గదులకు ఎంతో డిమాండ్ ఉంది. అయినా అధికారులు మాత్రం ఎవరూ రాలేదంటూ సిబ్బంది చెబుతున్నారు. అసలు గదులు ఎవరు తీసుకుంటున్నారు..ఎన్నిరోజులు ఉంటున్నారు? వారి స్థాయి ఏమిటి? అనే వివరాలు నమోదు చేస్తున్నారా? అనేది కూడా రహస్యమే. దీనికి సంబంధించి ఏమైనా రిజిస్టర్లు నిర్వహిస్తున్నారా? అని 'సాక్షి' అక్కడి సిబ్బందిని ప్రశ్నిస్తే నీళ్లు నమిలారు.

సిఫార్సు చేసినా అద్దె ఇవ్వాల్సిందే!



ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అద్దె గదుల కోసం ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినా, ఆర్‌అండ్‌బీ అధికారులు సిఫార్సు చేసినా అద్దె చెల్లించాల్సిందే. మరోవైపు అద్దె గదుల్లో మద్యం, ఇతరత్రా వాటికి వినియోగించుకుంటే ఉపేక్షించేది లేదు. ఉచితంగా ఎవరికీ గదులు ఇవ్వడం లేదు. ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుతాం. రాబడిని పెంచడానికి కృషి చేస్తాం. అద్దె గదులను అందరికీ అందుబాటులో ఉంచుతాం.

-డి. మధుసూదన్‌రావు, జిల్లా అధికారి, ఆర్‌అండ్‌బీ, తిరుపతి

ఆధ్యాత్మికతతో జీవనయాత్ర సఫలం

తిరుపతి సిటీ: భారతీయ సంస్కృతికి ఆధారాలు ఆగమాలని తిరుమల విఖనస ట్రస్ట్ కార్యదర్శి గంజాం ప్రభాకరాచార్యులు పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో అర్చనం అనే అంశంపై తొమ్మిది రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ, ఆగమ శాస్త్రం భగవన్నిర్మితమని, ఆయన అనుగ్రహం కోసం అందరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించి జీవన యాత్ర సఫలం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. విశిష్ట సంప్రదాయాలు, ఆచారాలు, భక్తి మార్గాలు మేళవించిన ఆలయం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయమని, ఆలయార్చనతో మనం తెలుసుకోవలసిన జ్ఞానం ఎంతో ఉందన్నారు. ముగింపు సదస్సులో విశ్రాంత ప్రొఫెసర్ తట్టా విజయ రాఘవాచార్యులు, ప్రొఫెసర్ వేదాంతం విష్ణు భట్టాచార్యులు తదితరులు పాల్గొన్నారు



ముగింపు సదస్సులో అతిథులు

శిక్షణతో స్వయం ఉపాధి

తిరుపతి కల్చరల్: స్వయం ఉపాధితో ప్రతి మహిళా కుటుంబానికి ఆసరాగా నిలవాలని సెట్విన్ సీఈవో మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ స్థానిక చెన్నారెడ్డి కాలనీలో మహిళలకు 3 నెలల పాటు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇచ్చింది. శిక్షణానంతరం గురువారం 70మంది మహిళలకు సెట్విన్ సీఈఓ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మబ్బు సూర్యనారాయణరెడ్డి, దిశ పోలీస్ స్టేషన్ సీఐ దమీస్ అహ్మద్, ఏపీ నైపుణ్యాభివృద్ధి డైరెక్టర్ లోకనాథం, సెట్విన్ మేనేజర్ మోహన్, కార్యదర్శి నాయక్, ట్రస్ట్ కో–ఆర్డినేటర్ రేవంత్, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.



టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు

కాలం చెల్లిన చిక్కీలపై రహస్య విచారణ ఎందుకు..?

పాకాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాలం చెల్లిన చిక్కీలపై రహస్య విచారణ చేయడం అనుమానాలకు తావిస్తోంది. హైకోర్టు ఆదేశాల మేరకు న్యాయవాదులు ఈ నెల 22న హైస్కూల్లో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సరఫరా చేసే చిక్కీలలో కాలం చెల్లినవి ఉన్నట్లు గుర్తించి ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమేష్‌కు సమాచారమిచ్చారు. దీనిపై కలెక్టర్ వెంకటేశ్వర్లు స్పందించారు. విచారణ చేయాలని డీఈఓ వి.శేఖర్‌ని ఆదేశించారు. బుధవారం డీఈఓ, పాకాల ఎంఈఓలు బాబ్జి, లింగయ్యతో కలసి రహస్యంగా విచారణ చేశారు. ఆగస్టులో తయారు చేసిన చిక్కీ బాక్సులు పది ఉన్నట్లు గుర్తించారు. అయితే విద్యార్థులకు సరఫరా చేసిన వాటిల్లో కాలం చెల్లినవి ఇవ్వలేదని తమకు అనుకూలంగా నివేదికలు జిల్లా కలెక్టర్‌కు పంపినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. దీనిపై ఎంఈఓ బాబ్జి వివరణ కోరగా.. కాలం చెల్లిన చిక్కీలను వెనక్కు పంపుతున్నట్లు చెప్పారు. వాటిని సరఫరా చేసిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామన్నారు.



కాలం చెల్లిన చిక్కీలు

ఘనంగా హియా జ్యువెలరీ వార్షికోత్సవం

తిరుపతి కల్చరల్: స్థానిక కేటీ రోడ్డులో అన్నారావు సర్కిల్ వద్ద ఉన్న హియా జ్యువెలరీ షోరూం వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. షోరూం అధినేత్రి రాయపాటి రాధిక జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. వార్షికోత్సవంలో భాగంగా కుందన్, పచ్చి, విక్టోరియన్ బంగారు ఆభరణాలపై తరుగు ఉండదని, డైమండ్ జ్యువెలరీ క్యారెట్ ధర రూ.56 వేలు మాత్రమేనన్నారు. రెండు రోజుల పాటు ఈ ఆఫర్ ఇస్తున్నామని, పట్టణ ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షోరూం అధినేత్రి రాయపాటి రాధిక

ముగిసిన పవిత్రోత్సవాలు

చంద్రగిరి: పట్టణంలో ఉన్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న జరిగిన పవిత్రోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఉదయం 11 నుంచి 11.45 గంటల వరకు శ్రీసీతారామ లక్ష్మణ సమేత హనుమంతస్వామి వారు, శ్రీ సుదర్శన చక్రతాళ్వార్‌లకు స్నపనతిరుమంజనం వేడుకగా జరిపారు. తరువాత చక్రతాళ్వార్‌కు చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ముని హరిబాబు పాల్గొన్నారు.



పవిత్రోత్సవాలను పరిసమాప్తం చేస్తున్న అర్చకులు

కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. దీపావళి ఆస్థానం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు ఆలయ సన్నిధితోపాటు ప్రాంగణంలోని ఇతర ఆలయాల గోడలు, పైకప్పు, పూజాసామగ్రి..ఇత్యాది వాటిని నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా సంప్రోక్షణ చేశారు.

ఉద్యోగులకూ దీపావళి కానుక ఇవ్వాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు దీపావళి కానుక ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కానుకను ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ, జీవీ.సత్యనారాయణ గురువారం ఓ సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 నెలలైందని, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆర్థిక బకాయిలు, కరువు భత్యం, వేతన సవరణ విషయాల్లో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దాదాపు రూ.12వేల కోట్లు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఫిర్యాదుల బాక్స్ ప్లీజ్!

-కలెక్టర్‌కు మహిళా ఉద్యోగుల వినతి

తిరుపతి అర్బన్: మహిళా ఉద్యోగులకు రక్షణగా ఉండాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహిళా విభాగం నేతృత్వంలో పలువురు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌ను వారు కలిశారు. ఉద్యోగినుల సమస్యలను తెలియజేయడానికి ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటుతోపాటు పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నేతలు తిరుపతి జిల్లా చైర్మన్ గోపినాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మహిళా విభాగం చైర్ పర్సన్ పి.సంధ్యారాణి, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర నిధులు కేటాయించాలి

తిరుపతి సిటీ: వర్సిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, కేంద్ర 10శాతం నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ రమణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, వర్సిటీ నాయకులు మాట్లాడారు. విద్య ప్రైవేటీకరణ, విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందన్నా రు. అనంతరం ఏఐఎస్ఎఫ్ ఎస్వీయూ నూతన కమిటీని 24 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రంజిత్ కుమార్, ఉపాధ్యక్షులుగా అజయ్, నరసింహులు, ఇక్బాల్, రాజు, ప్రధాన కార్యదర్శిగా చంద్ర నాయక్, సహాయ కార్యదర్శులుగా సురేంద్ర, అనిల్ కుమార్, ఉమేష్‌చంద్ర, నాగార్జున, కోశాధికారిగా వేణు, మహిళా కన్వీనర్లుగా వెన్నెల, శృతి, కో-కన్వీనర్లుగా మేఘన, శివరాం కుమారి ఎంపికయ్యారు.

26న కార్తీక్ మ్యూజిక్ లైవ్ షోను జయప్రదం చేయండి

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఈనెల 26న శనివారం నిర్వహించే ఇండియన్ ఐడెల్ టైటిల్ విజేత కార్తీక్ మ్యూజిక్ లైవ్ షో ప్రజలందరూ తిలకించి ఆదరించాలని నిర్వహణ ఎంటర్‌టెయిన్‌మెంట్స్ నిర్వాహకులు డాక్టర్ సజిత్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ షోకు సంబంధించిన అన్ని అనుమతులు పొందామని, ప్రత్యేక ఎఫెక్ట్ సౌండ్ సిస్టమ్, లైటింగ్‌తో అందరికీ వినోదాన్ని పంచేలా షో ఉంటుందని, దీనికి సుమారు ఆరువేల మంది హాజరు కానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నిర్వాహక ప్రతినిధులు జయప్రకాష్, చాణిక్య పాల్గొన్నారు.

బయట వ్యక్తులను వర్సిటీలోకి అనుమతించవద్దు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 26న జరగనున్న లైవ్ షో కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే బయట వ్యక్తులను వర్సిటీ ఆవరణలోని అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు గురువారం క్యాంపస్ పోలీస్‌స్టేషన్ సీఐ రామయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, నాయకులు అశోక్, వినోద్, నరేంద్ర, తేజ పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ పురోగతిపై సమీక్ష

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీ నిధులతో తూకివాకం వద్ద ఏర్పాటు చేసిన ఆరు మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ పనుల పురోగతిపై స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులతో సమీక్షించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో స్మార్ట్ సిటీ అధికారులు, ఏఈకాం, నోవాగ్రీన్ సంస్థ ప్రతినిధులు పనుల పురోగతిని ఆమెకు వివరించారు. ఇచ్చిన గడువు కంటే ఎక్కువ సమయం అవుతున్నా ఎందుకు ఆలస్యం అవుతోందని వారిని ఆమె ప్రశ్నించారు. స్మార్ట్ సిటీ అధికారులు, ఏఈకాం ప్రతినిధులు సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పెండింగ్ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డీఈ లలిత, ఏఈకాం ప్రతినిధులు బాలాజీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

లిడ్ క్యాప్ భూములను పరిరక్షించండి

చంద్రగిరి(తిరుచానూరు): లిడ్ క్యాప్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుల్లా రాజారావు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ, తిరుపతి రూరల్ దామినేడు గ్రామం లెక్కదాఖల సర్వే నంబర్ 71, 71/2, 72/3, 101/2లో 7 ఎకరాల భూమిని 1978 –79లో అప్పటి ప్రభుత్వం తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలోని మాదిగ చర్మ కార్మికులు, చెప్పుల తయారీ కార్మికుల కోస లిడ్ క్యాప్‌కు కేటాయించిందన్నారు. అయితే నిరుపయోగంగా ఉన్న ఈ లిడ్‌క్యాప్ భూములను చర్మకార కార్మికులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే లిడ్ క్యాప్‌కు రాయితీలు కల్పించి పూర్వవైభవం తీసుకురావాలని సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేస్తున్నార న్నారు. రాష్ట్ర మాదిగ మహా సంఘం అధ్యక్షుడు సుధాకర్ బాబు మాట్లాడుతూ... లిడ్ క్యాప్ భూములను పట్టించుకునేవారు లేకపోవడంతో ఇదే అవకాశంగా కొందరు భూ బకాసురులు కబ్జా చేయడానికి ప్రయత్నించారని, మాదిగ లిడ్ క్యాప్ పరిరక్షణ కమిటీ దీనిని అడ్డుకుందని చెప్పారు. కార్యక్రమంలో తిరుపతి మాదిగ లిడ్ క్యాప్ పరిరక్షణ కమిటీ చైర్మన్ సుబ్బయ్య, మాదిగ సంఘం నాయకులు, లిడ్ క్యాప్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న రాజారావు, ర మాదిగ సంఘం నాయకులు

చక్కటి సందేశంతో 'ఊహల్లో జీవితాలు'



ఊహల్లో జీవితాలు చిత్రం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దర్శకుడు, చిత్రం యూనిట్

–చిత్ర దర్శకుడు సుభాష్ బాబు

తిరుపతి కల్చరల్: అనివర్గాలకూ కనెక్ట్ అయ్యేలా చక్కటి సందేశంతో త్వరలో ×ఊహల్లో జీవితాలు× చిత్రాన్ని నిర్మించనున్నట్లు ఆ చిత్రం దర్శకుడు సుభాష్ బాబు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చిత్ర యూనిట్‌తో కలిసి చిత్రం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ చిత్రంలో ప్రముఖ సినీ నటులు సుమన్, ఆమని నటిస్తున్నారని, ముగ్గురు హీరోలు, హీరోయిన్లతో ఈ చిత్రాన్ని నవంబర్ మొదటి వారంలో హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియో పూజా కార్యక్రమాలు షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. చిన్మయ క్రియేషన్స్‌లో రూపొందుతున్న ఈ చిత్రం తనకు రెండవ చిత్రమని చెప్పారు. ఇందులో తిరుపతికి చెందిన పలువురికి నటించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. మూడు షెడ్యూల్స్‌లో చిత్రాన్ని పూర్తి చేసి విడుదల చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నటీ నటులు పద్మ, కరాటే ధనంజయ్, రెడ్డెప్ప, యూట్యూబ్ స్టార్ పొట్టి మామ(రవీంద్ర), లక్ష్మి, రాజు, నాయక్ భాయ్ పాల్గొన్నారు.

గణిత దీప్తి స్టడీ మెటీరియల్ పంపిణీ

పాకాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు గణిత దీప్తి స్టడీ మెటీరియల్‌ను గురువారం పాఠశాల హెచ్‌ఎం మహ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం ఈ స్టడీ మెటీరియల్‌ను తయారు చేసింది. దీనిని సద్వినియోగం చేసుకుని పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు రమేష్‌బాబు, పురుషోత్తం, రెడ్డెప్ప రెడ్డి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

రిజిస్ట్రార్ అవినీతిపై కమిటీ వేసి విచారణ చేయాలి

తిరుపతి సిటీ: ఎస్వీయూ రిజిస్ట్రార్ అవినీతిపై ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో కమిటీ వేసి విచారణ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బి సురేష్ నాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్సిటీలో అడుగడుగునా అవినీతి పేరుకుపోతోందని అక్రమ బదిలీలలో భారీ ఎత్తున చేతులు మారాయని తెలిపారు. వర్సిటీ స్టేడియాన్ని కమర్షియల్ కార్యక్రమానికి అనుమతి విషయంలో వర్సిటీ అధికారులు భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారని, పలు విషయాలపై సమగ్ర విచారణ చేయాలన్నారు.

కాలేజీకి 50 పుస్తకాల బహూకరణ



కళాశాల ప్రిన్సిపల్‌కు పుస్తకాలను అందజేస్తున్న రచయిత సోదరుడు వెంకటరామిరెడ్డి

పాకాల: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎస్‌కె.యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి రచించిన 'భారతదేశ స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రుల త్యాగాలు' పుస్తకాలను గురువారం రచయిత సోదరుడు కె.వెంకటరామిరెడ్డి కళాశాల ప్రిన్సిపల్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాజేంద్రనాయుడు, వెంకటరత్నంనాయుడు, సుబ్రమణ్యం, ఆర్‌వీ.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూ రికార్డులు రూపొందిద్దాం



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్

భాకరాపేట: భూసర్వేలో జరిగిన లోపాలను సవరించి సమగ్ర భూ రికార్డులను రూపొందిద్దామని చిన్నగొట్టిగల్లు తహసీల్దార్ జనార్ధనరాజు అన్నారు. గురువారం మండలంలోని కోటబైలు పంచాయతీ నల్లఓబులవారిపల్లెలో గ్రామసభ నిర్వహించి ఆయన మాట్లాడారు. నవంబర్ 23 వరకు భూ సమస్యలపై తమ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తామన్నారు. రీ సర్వే డివిజన్ ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు, ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్లు, గణేష్, కేశవులు, సాదిక్, రహంతుల్లా, మనోహర్, వీఆర్వో సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన





భూమన కరుణాకరరెడ్డిని అభినందిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి

ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులుగా భూమన కరుణాకరరెడ్డి నియమితులైన సందర్భంగా గురువారం పద్మావతీపురంలోని ఆయన నివాసంలో మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో అభినందించారు. పార్టీని మరింత క్రియాశీలకంగా మరింత ముందుకు తీసుకుపోవాలని ఆకాంక్షించారు. - తిరుపతి మంగళం